మనీషి

– పి.చంద్రశేఖర ఆజాద్

(1991 ఏప్రిల్ నెల చతుర నుంచి రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)

(ప్రారంభం)

నగరమంతా నిర్మానుష్యంగా ఉంది. రోడ్లన్నీ అలవాటైన పదఘట్టనలూ, వాహనాల కదలికలూ లేక విలపిస్తున్నాయో, విశ్రాంతి తీసుకుంటున్నాయో అర్థంకావటంలేదు.

గాలి సైతం దొంగలా కదులుతోంది. అప్పుడప్పుడు ఓ వాహనం ఆ రోడ్ల వెంట పరుగులు తీస్తోంది. అందులోనుండి నాలుగు దిక్కులకూ గురిపెట్టబడి ఉన్నాయి తుపాకులు. అది యుద్ధ దృశ్యం.

ఆ కళ్ళలోనూ మెదడులోనూ ఒకే వేగం అదే కనిపిస్తే కాల్చేయటం. కర్ఫ్యూ... కర్ఫ్యూ. అసలు నగరంలో మనుషులున్నారా? ఏమైపోయారు ఇన్ని లక్షలమంది? తలుపులన్నీ మూసి ఉన్నాయి. ఎలాంటి శబ్దాలూ లేవు.

ఎక్కడో ఓ కుక్క దారుణంగా ఏడుస్తోంది. ఈ ప్రపంచానికి ఏదో జరగబోతూంది. ఏ ప్రళయమో ముంచుకురాబోతూంది. చౌరస్తాల నడుమ ఆగిన వాన్‌నుండి బిలబిలమంటూ దిగుతున్నారు. లయ..వేగం..బూట్ల చప్పుడు..బందూకుల సవ్వడి. అంతలోనే నిశ్శబ్దం. అలాంటి భయానక వాతావరణంలో..

ఆ మేడమీద చిరుగాలి ధైర్యం చేసి ముందుకు కదిలింది. వేలాడుతున్న ఆ లాల్చీని స్పృశించింది. ఒక్కసారిగా కదలిక. మెల్లగా మెల్లమెల్లగా స్వేచ్ఛగా గాలివీస్తోందక్కడ.

ఆ లాల్చీ ఎగురుతోంది. గాలికి రెపరెపలాడుతోంది. ఆ లాల్చీ వీపు వెనకభాగం చిరిగిపోయివుంది.

మేడమీదకు వెళ్ళాడు 'రావ్'.

ఆయన ముఖం గంభీరంగా ఉంది. ఒక్కసారి వెళ్ళి కిటికీ తలుపు తీశాడు. నగరంలో ఓ భాగం కనిపిస్తోంది. అలాంటి మంచి దృశ్యంకోసమే ప్రత్యేకంగా ఈ స్థలం ఎన్నుకున్నాడు. డబ్బు కొంత ఎక్కువే అయింది. అయినా సరే తను కోరుకున్న రీతిలో ఇంటిని నిర్మించుకున్నాడు. అందులో తన గదిని మరీ ప్రత్యేకంగా రోజూ కొద్ది క్షణాలు అక్కడ నిలబడి నగరపు అందాల్ని వీక్షించటం అతని అలవాటు. ఎప్పటిలానే తలుపు తెరిచాడు.

అదే దృశ్యం..

కానీ ఆనందం కలిగించటంలేదు. గుండెను ఎవరో నొక్కిపట్టి ఉంచినట్లనిపించింది.

అతనికి 'అమ్మ' గుర్తుకువస్తోంది.

పెదవులు మెల్లగా "అమ్మా" అనటానికి ప్రయత్నం చేశాయి. శబ్దం రాలేదు. కొద్దిగా వణికాయి. ఆ ప్రతిస్పందన శరీరమంతా పాకగా కళ్ళనుండి రెండు కన్నీటిబొట్లు.

ఫోన్ మోగింది.

తనను తాను కంట్రోల్ చేసుకుంటూ ఫోన్ అందుకున్నాడు.

అవతలనుండి ఎవరో మాట్లాడుతున్నారు.

నిశ్శబ్దంగా వింటున్నాడాయన.

కొద్దిసేపటి తర్వాత తను మాట్లాడాడు.

"అవును.. ఏర్పాట్లు చేయాలి"

"కష్టమే నాకు తెలుసు. అయినా తప్పదు. మరలా ఫోన్ చేస్తారుగా"

"ఉంటాను"

ఫోన్ పెట్టేసి పక్కకు చూశాడు.

గదిముందు సులోచన నిలబడివుంది. ఆమె కళ్ళలో ప్రశ్నలు.

"గంగాధర్ ఫోన్ చేశాడు" అన్నాడు రావ్.

ఆమె గదిలోపలకి నడిచివచ్చింది నిశ్శబ్దంగా తెరిచిన తలుపులు మూసివేసింది.

"ఎందుకు ఆ తలుపులు మూస్తున్నావ్ సులోచనా?"

"తెరిచి ఉంచే రోజులా ఇవి"

"గాలి వస్తుందని"

"గాలే వస్తుందో తుపాకి తూటాలే వస్తాయో ఎవరు చూశారు" నిర్లిప్తంగా అందామె.

రావ్ తలూపాడు.

"కిందకు వెళ్దాం రండి" అందామె.

"నాకెందుకో ఇక్కడే ఉండాలనిపిస్తూంది. కింద ఎవరెవరున్నారు?"

"పనిమనుషులున్నారు. సాంబ్రాణి కడ్డీలు వెలిగించి పెట్టించాను"

తలూపాడు. కొంచెంసేపు చూశాక అందామె.

"నేను కిందకు వెళ్తాను"

"అలానే నాకు కొంచెంసేపు ఏకాంతం కావాలి"

ఆమె నిశ్శబ్ధంగా మెట్లు దిగి వెళ్ళిపోయింది.

★★★

"సాంబయ్య లేచాడంటే" భూషయ్య అరిచాడు.

"లేచాడుగా" పెద్దగానే చెప్పింది లోపల నుండి పనిచేసుకుంటూనే.

"మరేమైపోయాడు? అవతల పొద్దెక్కిపోవటంలా" అంటూ అటూ ఇటూ చూశాడు.

సాంబయ్య అప్పటికి గానుగచెట్టు దగ్గరికి వెళ్ళి ఓ పుల్ల తెంచుకున్నాడు. దానికేసి పరీక్షగా చూసి సంతృప్తి చెందాక నోట్లో పెట్టి నవలడం ఆరంభించాడు. దొడ్లో గేదెల దగ్గర భూషయ్య వంగాడు. రొచ్చు రొచ్చుగా ఉందక్కడ. అప్పటికే భీముడు పనిచేస్తున్నాడు.

"ఓరి భీవుడూ. నేను చేస్తాగానీ సాంబయ్యగాడు ఏవైపోయాడో చూసిరా" అన్నాడు.

"ఆఁ" అని చేస్తున్న పనాపి భీముడు, సాంబయ్యకోసం బయలుదేరాడు. ఓ మూలన కూర్చుని తాపీగా పందుంపుల్ల నవులుతున్న సాంబయ్యను చూసి "ఏంది బాబూ ఇక్కడ కూర్చున్నారేంటీ? అయ్యగారు పిలుత్తున్నారు" అన్నాడు.

"మొఖం కడుక్కుంటున్నారా" అన్నాడు సాంబయ్య.

"ఏందిరా మొఖం కడిగేది. ఎంతసేపు కడుగుతావురా. ఆ గొడ్డకాడ పేడకళ్ళు తియ్యమన్నానా" అరిచాడు ఎప్పుడొచ్చాడో భూషయ్య.

ఉలిక్కిపడి లేచి నిలబడి ఏవనాలో తెలీక వళ్ళు రుద్దటం మొదలుపెట్టాడు.

"తొందరగా తెవులు. నేనూ భీవుడూ చేనుకాడికి ఎల్లాల" అని వెళ్ళిపోయాడు.

భీముడు కూడా మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళాడు.

సాంబయ్యకు కోపం వచ్చింది.

తనకు గేదెల దగ్గర పనిచేయటం అంటే ఏమ్రాతం ఇష్టం ఉండదు. అసలు ఆ వాసన అంటేనే గిట్టదు. సాయంకాలం అయ్యేసరికి శుభ్రంగానే ఉంటుంది. దోమలు వాటిని కుడుతుంటే భూషయ్యగారు తెగ బాధపడిపోతారు. వెంటనే పొగపెట్టిస్తాడు. ఆ పొగకి దోమలు వెళ్ళిపోతే అవి హాయిగా విశ్రమిస్తాయని ఆయన తృప్తిపడతాడు.

వాటికి పడుకోబోయేముందుకూడా ఏం కావాలో చూసి, గడ్డి సరిపడా ఉందా లేదా అనేది పరిశీలించి, అవసరమైతే వామునుండి దూసి వేసేదాకా ఆయనకు నిద్రపట్టదు.

నిద్రపోయినా ఏ నడిఝామూలోనో లేచికూచుంటాడు.

ముందు మెల్లగా దగ్గుతాడు.

అప్పటికి తులసమ్మకి కూడా మెలుకువ వస్తే సరి లేకపోతే అతనే లేచి గేదెల చావిడి దగ్గరకు వెళ్తాడు. ఆ సరికే అక్కడ బీభత్సంగా ఉంటుంది.

చేతిలో కర్రతో గడ్డిని అటూ ఇటూ కదుపుతాడు. కొంచెం సేపు చూసి తిరిగి వచ్చి మంచంమీద కూర్చుంటాడు.

ఆ శబ్దానికి తులసమ్మకి మెలుకువ వస్తుంది.

"మంచినీళ్ళు అయిపోయాయా?" అంటుంది.

"లేదు. మెలుకువొచ్చింది. గొడ్డుకాడికెళ్ళి చూసొచ్చా"

"ఎందుకా చీకట్లో ఆ భీవుడ్ని లేపకూడదూ"

"ఆడికి మాత్రం చీకటి కాదా.. అయినా పొద్దుననంగా లేచి పనిచేసుంటాడు కదా. ఆదమరిచి నిద్రపోతాడు. ఆడ్నెందుకు ఇబ్బంది పెట్టడం" అని దుప్పటి సరిచేసుకుంటాడు.

"ఇప్పుడే కంటిమీద కునుకు పడతా ఉంది. ఇంక ఎంత తన్నుకున్నా నిద్రపట్టిచావదు" అంటుంది తులసమ్మ.

"ఇంకేం నిద్రపోతావే. ఇంకొంచెం సేపట్లో కోడి కూసుద్ది"

"మరికేం కొంచెంసేపన్నా కళ్ళు ముసుకు పడుకోకూడదూ" అంటుంది. ఏదో గొణుగుతూ మంచంమీద నడుం వాలుస్తాడు.

"దీని సిగదరగ. నడుంనొప్పి వస్తుంది. మంచవంతా కుక్కి కుక్కి అయింది. దీని సంగతి చూద్దామంటే కుదిరిచావటంలా" అని గొణిగి ఆకాశంకేసి చూస్తాడు. ఆకాశంలో చుక్కలు మెరుస్తుంటాయి. సాధ్యమైనంతవరకూ బయటే పడుకుంటాడు.

"ఎందుకక్కడ లోపలికి రాకూడదూ" అంటుంది.

"కమ్మటి గాలిడిసిపెట్టి లోపలకి రమ్మంటావేంటే!?" అని అక్కడే పడుకుంటాడు.

వానాకాలంలో కూడా అంతే. తులసమ్మ కూడా ఆయన్తోపాటు బయటే పడుకుంటుంది. రెండు చినుకులు పడగానే లేచి తన మంచంలోనికి ఈడ్చుకుంటుంది. ఆయన్ని రమ్మని అడుగుతుంది.

భూషయ్య వినడు.

"రెండు చినుకులకే మొక్క మొలవంలేవే. అయినా ఇది కురిసిచచ్చే వానకాదు. ఇంక చూడు ఉడకపోసుద్ది" అంటూ అలానే పడుకునేవాడు. సాధారణంగా చిన్నచిన్న చినుకుల్ని ఏమాత్రం ఖాతరు చేసేవాడు కాదు. వాన మరీ పెద్దదయినా చూరుకిందకి మంచం ఈడ్చుకుని పడుకునేవాడు. రాత్రి పూటే వాళ్ళిద్దరి సంభాషణ నడిచేది.

"అబ్బ..పాడు దోమలు.. నిద్రలేక చంపుతున్నాయి" అంటూ ఎవరితోనో అన్నట్లు లేచి కూర్చునేది.

భూషయ్య మాట్లాడేవాడు కాదు.

"లేదులే చెప్పు"

"ఆ సాంబయ్యగాడ్ని గొడ్డకాడ పనిచెయ్యి పనిచెయ్యి అని పానాలు తోడతావెందుకు?"

"మరేం చేయాలంట?"

"ఏం చేసేదేముంది? వాడు బళ్ళోకి వెళ్ళి చదుకుంటున్నాడు. ఆడ్ని ఇంకా బాగా చదువుకోరా అనాల్సిందిపోయి ఆ పేడ తియ్యి. ఆ గాబు కడుగూ అంటూ ఊరికే సతాయిస్తావెందుకు?" అంది.

"ఏందేవ్ ఆడేవన్నా రాజుగారబ్బాయనుకున్నావా? భూషయ్య కొడుకు. ఆడికి గొడ్డకాడ పనిచేయటానికి నామోషి వచ్చిందా? దేశంలో ఈడొక్కడే చదువుకుంటున్నాడా ఏమిటి? అందరూ పనులు చేసుకుంటున్నారు."

"ఆడుమాత్రం చెయ్యటంలేదా? చేస్తానే ఉన్నాడుగా"

"చేస్తన్నాడులే నువ్విట్టాంటివి ఆడికి నేర్పబాక. గొడ్డకాడ కాదు. పాకీపని చేయాల్సివొస్తది"

"నా అబ్బాయికి అలాంటి కర్మేం పట్టలా" అంటుంది తులసమ్మ ఉక్రోషంగా.

"ఓసోస్.. కబుర్లు చెప్పబాకవే. తెల్లారికల్లా ఏమవుతుందో ఎవరు చూడొచ్చారు. రాజ్జాలేలాలో అడుక్కు తినాలో మనవే చేప్పేస్తంటే సంవత్సరానికి ఆరు వంటలు పండిపోవంటే" తులసమ్మ ఏదో గతుక్కుంది.

"సర్లే పడుకో. అయినా మూడు చెక్కలు తిన్నోడు మహారాజయ్యాడని పెద్దాళ్ళు ఊరికే చెప్పలా. మనింటో పనిచేసుకోవటానికి ఇప్పటినుండే బాధగా ఉంటే రేపు ఆడు ఏమవుతాడో వేరే సెప్పాలా. నీకు తెలుసుగా మన షావుకారి కొడుకు ఇట్టాంటి ఏసాలేసి అటు చదువూరాక, ఇటు ఈ పనులు రాకా ఆడి బాబు సంపాయించిందంతా తగలేత్తా కూకున్నాడు"

"ఆళ్ళ సంగతి మనకెందుకులే. మన సాంబయ్య అట్లాంటోడు కాదు. ఆడు బాగా చదువుకుంటాడు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తాడు ఆయన్నీ చూట్టానికి మన కళ్ళు చాలవనుకో"

"జోడు కొనిచ్చుకుందువుగానిలే తులసమ్మా" అంటాడు భూషయ్య.

"చాల్లే సడసం. అర్ధరాత్రి అంకమ్మ శివాలని ఇంక పడుకో"

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటున్నప్పుడు సాంబయ్యకు మెలకువ వస్తుంది. వారి మాటల్లో తన గురించి ఏమైనా ఉంటుందేమో అనే ఆసక్తి కలుగుతుంది. మొత్తంమీద ఎప్పుడో ఓసారి తన విషయం ప్రస్తావనకు వచ్చితీరుతుంది.

అమ్మ తన నాన్నదగ్గర అలా మాట్లాడుతుందిగానీ, తనతో మాట్లాడేటప్పటికి ఆమె పద్దతి మారుతుంది.

"సాంబయ్యా" అంటూ పిలిచింది.

అప్పటికి మొఖం కడిగి కండవాతో తుడుచుకుంటున్నాడు.

"ఇంకా అలా కూర్చుండిపోతే ఎట్టారా మీ నాయన గేదలకాడ పనుందని గొడవపెడుతున్నాడా? గబగబా వెళ్ళి ఆ రెండు పేడకళ్ళూ తియ్యొచ్చుగా. అయినా మీ నాన్నని చూసి నేర్చుకోవాలి బాబూ. ఝాము పొద్దుండగానే లేస్తాడా. లేచిందగ్గర్నుంచి క్షణం ఖాళీగా కూర్చుంటాడా. ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుపోతుంటాడు. మనపని మనం చేసుకోవటంలో తప్పులేదు. అయినా మనం ఉన్నవాళ్ళం కాదు. మాకు నువ్వొక్కడివి. నీకు చదువూ సంజా చెప్పిస్తే చాలు. వెళ్ళువెళ్ళు" అంటూ వత్తిడి చేసింది.

సాంబయ్య మాట్లాడకుండా వెళ్ళి ఆ పేడను చేతులతో ఎత్తుతుంటే కడుపులో తిప్పేట్లు వాసన.

తన బిడ్డ పనిచేస్తుంటే భూషయ్య కొంచెం సేపు చూసి.

"ఏంటిరా బేరం చేత్తన్నావా.. ఉండెహె" అంటూ దూసుకొచ్చి గొడ్లు తొక్కిన గడ్డినంతా మడిచి దాంతోనే పేడకళ్ళు చుట్టీ అమాంతం పెంటపోగుమీద విసిరి పొలికట్ట అందుకున్నాడు.

గాబునిండా నీళ్ళు పోసి అందులో తవుడూ, చిట్టూ కలిపి గేదెలు తాగుతుంటే ఆయన కళ్ళలో అనిర్వచనీయమైన ఆనందం..

"సాంబయ్యా" పిలిచాడు.

"ఏంటి నాన్నా?"

"బడికి ఎల్తావంటరా?"

"అవున్నాన్నా"

"సర్లే.. నీళ్ళు పోసుకుని వెళ్ళు"

సాంబయ్య ఉత్సాహంగా ఇంట్లోకి వెళ్ళాడు.

"ఏంటిరా? అప్పుడే అయిపోయిందా?" అంది తులసమ్మ.

"లేదమ్మా.. నాన్న బడికి వెళ్ళమన్నాడు"

తులసమ్మ ముఖంలో సంతోషంతో కూడిన దరహాసం.

"అవును బాబూ.. మీ నాన్న అన్నీ నీమంచికే చెబుతాడు. ఆయన ఏం చెబితే అది చెయ్యి. ఆయన మనసుని కష్టపెట్టబాకు" అంది.

సాంబయ్య తలూపాడు.

తన నాన్నంటే అభిమానం, ప్రేమా, ఆయన పట్ల నిశితమైన పరిశీలనా ఆరంభం అయ్యాయి సాంబయ్యలో.

భూషయ్యగారిది మధ్య తరగతి కుటుంబం.

భూషయ్యకి ఓ తమ్ముడూ, ఇద్దరు అక్కలూ ఉన్నారు. ఓ అక్కావాళ్ళు మాత్రం పొలాలు కొనుక్కుని బళ్ళారి వెళ్ళిపోయారు. వారి దగ్గరనుండి పెద్దగా వార్తలు రావు. తమ్ముడు కూడా కొంతకాలంపాటు ఈ ఊర్లోనే ఉన్నా, ఆ తర్వాత తన వంతుకు వచ్చిన భూమిని అమ్ముకుని బళ్ళారి చేరిపోయాడు.

భూషయ్య మాత్రం అందుకు అంగీకరించలా.

"ఈ ఊర్లో బతకలేకపోతేగదంటే ఇంకో చోటికి బోవాలి. అయినా నాకు ఒక్కగానొక్క కొడుకు. ఆడికోసం నేను పుట్టి పెరిగిన ఊరొదిలిపోతానా" అనేవాడు.

ఒక ఊళ్ళో ఉన్నారనేగానీ తన అక్కను వారానికోసారి చూడటం గగనమే. ఎవరి పనుల్లో వారు మునిగిపోయేవారు.

భీముడ్ని పొలం పనులకీ, ఇంటి పనులకీ మాట్లాడుకున్నారు. భీముడితోపాటు, భీముడికంటే భూషయ్యగారే ఎక్కువ పనిచేస్తాడు. ఆయన చేతిలో ఎప్పుడూ కర్ర ఉంటుంది. వంటిమీద చొక్కా ఉండేదికాదు. ఓ కండువా మాత్రం భుజాన ఉండేది. ఒక్కోసారి దాన్ని తలపాగాలా చుట్టుకునేవాడు. నేలకి కర్రా చరచుకుంటూ నడిచివస్తుండేవాడు.

ఆ ఊర్లో అందరూ భూషయ్యగారిలా ఉంటారనేంలేదు. పొందూరు ఖద్దరు ధరించి నల్లటి గ్లాసులు పెట్టుకుని, మోటార్ సైకిళ్ళమీద పరుగులు తీసేవారి దగ్గరనుండి ఖద్దరు బట్టలు ధరించేవారి వరకూ ఉన్నారు.

"ఎండలోబడి పనిచేసేవారికి చొక్కాయిలెందుకురా. అయన్నీ ఖాళీగా తిరిగేవారికిరా" అంటూ కొట్టేసేవాడు.

ఆయన పంచెలుకానీ, కండవాలుగానీ నీరుకాయలెక్క ఎర్రగా కనిపించేవి. తను పనంతా చేసివచ్చాక పీట వాల్చుకుని కూర్చుంటే తులసమ్మ అన్నం వడ్డించేది. తనకి కొంచెం దూరంలో భీముడు పళ్ళెం పెట్టుకుని కూర్చునేవాడు. దాంతోపాటు వంపులో చెంబునిండా నీళ్ళు పట్టుకుని తెచ్చుకునేవాడు.

ఆయనకు భోజనంలో ఏముంది, ఏం లేదు అనే సమస్య ఉండేదికాదు. ఎక్కువగా పచ్చడితో తినేవాడు.

"నువ్వా పచ్చడి మానమంటే మానవు. గుండెల్లో మంటలు లేస్తాయి" అని సణుగుతూనే ఉంటుంది తులసమ్మ.

పళ్ళెం నిండా మజ్జిగ పోయించుకుని అందులో ఉల్లిపాయ నంజుకుంటూ జుర్రుకు తినేవాడు. అన్నం తిని పక్కన ఊరికే కూర్చునేవాడుకాదు. ఏ తాడో పేనుతూ ఉండేవాడు. తులసమ్మ వస్తూ అనేది.

"నువ్వు మాత్రం క్షణం ఖాళీగా కూర్చోవు. ఇప్పుడా తాళ్ళు పేనకపోతే ఏమవుతుంది" అంటూ.

అదేం పట్టనట్లుగా భీముడితో ఏదో చెబుతూనే ఉండేవాడు.

ఆ ఊరేం పెద్దది కాదు. అక్కడ ఏడు తరగతులవరకూ ఉన్న బడి మాత్రం ఉంది. ఆ తర్వాత రెండుమైళ్ళు నడిచి వెళ్తేగాని ఇంకో బడిలేదు. ఆ ఊరి పిల్లలందరూ సంచిలో పుస్తకాలూ క్యారియర్‌లో భోజనం తీసుకుని వెళ్తుంటారు. అక్కడకూడా కొంతవరకే ఉంది.

అంతకుమించి చదవాలంటే పట్నం వెళ్ళాల్సిందే కొంతమందయితే తమ తమ పిల్లల కోసం కాపురాలు మారుస్తున్నారు. వారందరూ వ్యవసాయం చేయటం కూడా మానుకుని తమ పొలాల్ని కౌలుకిస్తున్నారు.

సాంబయ్య ఇంకా ఈ ఊర్లోనే చదువుకుంటున్నాడు. ఆ రోజు బడి అయిపోయాక ఇంటికి వస్తున్నప్పుడు పిల్లలందరూ బట్టల విషయం గురించి మాట్లాడుకున్నారు.

"మా నాన్న కొత్తబట్టలు తెచ్చుకున్నాడురా" అన్నాడు పిల్లవాడు.

అవెంత బాగున్నాయో, ఆ తర్వాత తనకు ఎలాంటి బట్టలు తెస్తాడో వివరంగా చెప్పాడు.

సాంబయ్య మాత్రం వింటుండిపోయాడు. సాంబయ్య అసలు పేరు సాంబశివరావు అయితే ఇంట్లోనూ, ఊర్లోకూడా అందరూ 'సాంబయ్యా' అనే పిలుస్తారు. భూషయ్యగారికి బట్టల విషయంలో ఏమాత్రం శ్రద్ధలేదు. అదే విషయాన్ని తన కొడుకు విషయంలో కూడా అమలు చేయటానికి ఆయన నిశ్చయించుకున్నాడు.

తను ఏ రకంగా జీవిస్తున్నాడో ఆ రకంగానే తన బిడ్డ ఎదగాలని ఆయన ఆరాటం. ఆ ఆరాటాన్ని సాంబయ్య అర్థం చేసుకోలేకపోయేవాడు. అసలు తను వింటున్నవాటిని బట్టి మొత్తంగా తమ ఊరే ఓ ప్రత్యేకమైనది. అందులో తన నాన్న మరీ ప్రత్యేకమైనవాడు. ఆ పిల్లలందరూ తమ తమ బట్టల గురించి చెప్పుకుని ఊరుకుంటే సాంబయ్యకూడా అంత బాధపడి ఉండకపోను.

"సాంబయ్యా మీ నాన్నకి కొత్తబట్టలున్నాయంట్రా?" అన్నారు.

"ఎందుకులేవూ?"

"మరెప్పుడూ వేసుకోడే?"

"పొలం పనులకెళ్తాడుగా.. అందుకు"

"పొలం పనులు అయిపోయాక వేసుకోవచ్చుగా?"

ఈ ప్రశ్నకు సాంబయ్య జవాబు చెప్పలేకపోయాడు. ఆ తర్వాత ఇంకో పిల్లాడు ఓ విషయం చెప్పాడు.

"ఒరేయ్. మా మావయ్యగారి ఊర్లో పెద్ద షావుకారు ఉన్నాడంట. ఆయనకేమో బోల్డన్ని పొలాలూ మేడలూ ఉన్నాయి. అయినాకూడా చొక్కావేసుకోడు"

"ఎందుకనిరా?" అన్నారు పిల్లలు.

"పీనాసోడు" అన్నాడు.

పిల్లలంతా నవ్వారు.

సాంబయ్య ముఖం మాడిపోయింది. తన నాన్నను పేరుపెట్టి అనకపోయినా, వీళ్ళందరూ ఎగతాళి చేస్తున్నారు. వీళ్ళను ఏదైనా అనాలి అనుకున్నాడు. అంతలోనే అలాంటి ఆలోచనలు మానుకున్నాడు.

"ఒరేయ్ సాంబయ్యా తగాదాలు మన కొంపమీదకి తేవద్దు. బుద్ధిగా చదువుకుంటానంటే సరే. లేకపోతే నాతోపాటు చేనుకాడికిరా" అని ఖచ్చితంగా చెప్పాడు నాన్న.

"మీ నాన్న చొక్కా తొడుక్కోడు. మరి నీకు ఎన్ని జతలున్నాయిరా?" అన్నారు.

"మూడు జతలున్నాయి" అన్నాడు.

పిల్లలందరూ తమకు ఎన్నెన్ని జతల బట్టలున్నాయో విడమర్చి చెబుతుంటే తమ ఇల్లు దగ్గరకొచ్చింది.

"నేను వెళ్తారా" అన్నాడు సాంబయ్య.

అందరూ సరే అన్నారు. అయినాసరే వారందరూ నవ్వుతూ ఉన్నట్లనిపించింది.

ఇంటికివెళ్ళి పుస్తకాలు పడేసి అమ్మదగ్గరికి వెళ్ళాడు. ముఖం చూడగానే ఆమె అడిగింది.

"ఏంటి సాంబయ్యా..? అట్టా ఉన్నావే ఎవరేమైనా అన్నారా?"

సాంబయ్యకి ఆ మాటల్తో కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. కొంచెం సేపటి తర్వాత తమ స్నేహితులు అనుకున్న విషయం గురించి చెప్పాడు. తులసమ్మకి జాలి కలిగింది. "రేపు దీపావళి. పండగకి నేను నీకు కొత్తబట్టలు కుట్టిస్తాగా. నువ్వు బాగా చదువుకో" అందామె.

తన బిడ్డకు ఇలాంటి విషయాలు చదువుమీద విముఖత కలిగించకూడదని ఆమె ఆరాటం. సాంబయ్యకు మాటలు సంతృప్తిని కలిగించాయి. ఆ రోజు రాత్రి అమ్మ ఈ విషయం కదిలిస్తుందని తనకు తెలుసు. అందుకే బలవంతంగా నిద్ర ఆపుకోవటానికి ప్రయత్నం చేశాడు. అయితే తనవల్ల కాలేదు. నిద్రముంచుకు వచ్చింది.

రాత్రి మామూలుగానే భూషయ్యకూ, తులసమ్మకూ సంభాషణ జరిగింది.

"నువ్వు నీ పద్ధతులు మార్చుకోవాలయ్యా" అంది తులసమ్మ.

"ఏందే అయ్యి?" అన్నాడు భూషయ్య.

"సాంబయ్యని పిల్లలు మీ నాన్న చొక్కా ఎందుకు వేసుకోడని అడిగారంట"

"అయితే ఏంటంట?"

"ఎందుకయ్యా అట్టా ఉంటావు. ఎండకీ, వానకీ నీది వొళ్ళు కాదన్నట్టు వదిలేశావు. కొంచెం సాయంకాలంపూటన్నా చొక్కా తొడుక్కోకూడదూ" అంది.

"నీక్కూడా పిచ్చిగాని పట్టిందా?"

"ఊరుకోవయ్యా బాబూ. బట్టలు తొడుక్కోవటం పిచ్చా ఇంకా నయం.. ఆ బళ్ళోకి రానిస్తే సాంబయ్యకి గోచిపెట్టి పంపిస్తావనుకుంటా?"

"నేను బతికినట్టే ఆడూ బతుకుతాడే అయినా నాకు తెలియక అడుగుతా, మన గొడ్డూగోదాకి బట్టలున్నాయంటే"

"గొప్ప సిత్రం చెప్పావుగా గొడ్డూగోదా మనుషులూ ఒకటేనా? రానురానూ నీ ఛాదస్తం పెరిగిపోతుందే" అంది.

"అవునే. అయిమట్టుకు మనతోపాటు పనిసేయటంలా"

"ఎందుకు చేయవు? అయితే ఆటికి కూడా బట్టలు కొను. అయినా పెద్ద పండక్కి గంగిరెద్దులకి కూడా బట్టలు కట్టడంలా"

"ఏమోనే నేను మట్టిని నమ్ముకుని బతుకుతున్నా"

"మంచిది. సాంబయ్య కూడా నీకుమల్లే ఎర్రటెండలో చేనుకాడికి పోకూడదు. ఆడు బాగా సదువుకోవాలి. సదువుకునే పిల్లాడికి బట్టలుండాలి. ముందాడికి బట్టలు చింపించు" అంది తులసమ్మ.

"ఆటి సంగతి నాకేం తెల్సే" అన్నాడు భూషయ్య.

"మరేం తెలుసు. ఆ గొడ్డకాడ బాగుచేయటం. ఆ పొలం దగ్గిరకెళ్ళటం, ఇంటికొచ్చి పనిచేస్తే చాలా" అంది.

చివర్లో మెలుకువ వచ్చిన సాంబయ్యకు. అర్థం అయిన విషయం ఏమిటంటే త్వరలో తనకు మంచి బట్టలు రాబోతున్నాయని.

తెల్లవారాక తులసమ్మ ఈ విషయం గురించి తన పక్కింటావిడతో మాట్లాడింది.

"వదినా ఈసారి ఊరు వెళుతున్నప్పుడు చెప్పు. మా సాంబయ్యకి బట్టలు చింపించాలి"

"నువ్వు కూడా వస్తావా?"

"నేనెక్కడొస్తాను. నువ్వు వెళ్తున్నావుగా చింపించుకురా"

"మరి నీకు నచ్చాలిగా"

"నచ్చేదేముంది? పిల్లాడు తొడుక్కునేవి. ఆ మాత్రం నీకు తెలియదా? తెల్లవి కాకుండా ఉంటేచాలు. మట్టి అయినా కనపడకుండా వుంటే చాలు" అంది.

"ఏ ధరలో తెమ్మంటావ్?"

తులసమ్మకు ఎంత చెప్పాలో అర్థంకాలేదు.

"నీకు తెలియందేముంది వదినా ఎంతో. ఎంతో నీకు నచ్చితే చాలు. నీ పిల్లలకి తెచ్చినట్లుతే" అంది.

"సర్లే" అందావిడ.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS